క్లుప్తంగా

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఉగ్గ మూడి గ్రామంలో నూతనంగా నిర్మించిన శివా లయంలో శ్రీఅన్నపూర్ణ సమేత అమరేశ్వర స్వామి విగ్రహాలను గురువారం శాస్త్రోక్తంగా ప్రతిష్టించారు. భారీ సంఖ్యలో భక్తులు విచ్చేశారు. తీర్థ, ప్రసాదాలను పంపిణీ చేశారు.

జయగురు దత్తా.. శ్రీగురు దత్తా



ప్రత్యేకాలంకరణలో స్వామివారు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): తొట్టంబేడు మండలంలోని రౌతు సూరమాల గ్రామంలో వెలసి ఉన్న శ్రీదత్తాత్రేయస్వామి ఆలయం గురువారం ప్రత్యేక అభిషేక పూజలు, అలంకరణలు జరిగాయి. శ్రీగురు చరిత్ర పారాయణం, సిద్ధమంగళ స్తోత్రాన్ని భక్తులు పఠించారు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

టిప్పర్ ఢీకొని శిలాఫలకం ధ్వంసం



నూతనంగా నిర్మించిన శిలాఫలకం

సత్యవేడు: పంచాయతీ పరిధిలో బుధవారం రాత్రి టిప్పర్ ఢీకొనడంతో గడియారపు స్తంభం శిలాఫలకం ధ్వంసం అయ్యింది. రాత్రికి రాత్రే శిలాఫలకాన్ని యథాతథంగా నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. రోజూ పగలు, రాత్రి అనే తేడా లేకుండా అతి వేగంతో టిప్పర్లు వెళుతుండడంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. టిప్పర్లు గాంధీ రోడ్డు, నేతాజీ రోడ్లపై అతి వేగంగా వెలుతుండంతో ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళన వ్యక్తం అవుతోంది. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, మార్కెట్‌కు వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు. టిప్పర్ల పైనుంచి వచ్చే దుమ్ముతో దుకాణాలు మూసుకుపోతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. టిప్పర్లు పట్టణంలో పరిమితి వేగంలో వెళ్లేలా పోలీసులు చర్యలుతీసుకోవాలని కోరుతున్నారు.

టీపీ కోటలో ప్రత్యేక ఆరోగ్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

నాగలాపురం: మండలంలోని టీపీ కోట గ్రామంలో సర్పంచ్ సక్కుబాయి, వైస్ సర్పంచ్ సాధిక్ బాషా ఆధ్వర్యంలో గురువారం వైద్యాధికారులు రాజేష్ రెడ్డి, విజయ్ కుమార్ ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వాతావరణ మార్పుల కారణంగా గ్రామంలో దగ్గు, జలుబు, జ్వరాలతో పలువురు బాధపడుతుండడంత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులతో శిబిరాన్ని నిర్వహించారు. అందరికీ వైద్య పరీక్ష చేసి వారికి మందులు పంపిణి చేశారు.

ఇసుక తరలింపు నిషేధం



ఓబయ్య, ఎస్‌ఐ

నాగలాపురం: మండలంలోని అరుణానదిలో ఇసుక తరలింపును శుక్రవారం నుంచి నిషేధిస్తున్నట్లు ఎస్ఐ ఓబయ్య తెలిపారు. ఇసుక స్టాకు పాయింట్ల వద్ద నుంచి గానీ, అరుణ నది నుంచి గానీ ట్రాక్టర్లు, టిప్పర్లు, ఇతర మార్గాల ద్వారా ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం అనుమతి ఇచ్చేంత వరకు ఇసుక తరలింపును రద్దు చేసినట్లు స్పష్టం చేశారు.

పంట పొలాల్లో గూడబాతు



దొరవారిసత్రం: వయస్సు మీద పడి ఎగరలేక ఓ గూడబాతు వెదురుపట్టు గ్రామానికి వెళ్లే మార్గంలోని పంట పొలాల్లో గురువారం దర్శనమించింది. దీన్ని గుర్తించిన కొందరు దాన్ని తరమినా ఎటు వెళ్లకుండా అక్కడే ఉండింది. ఈ విషాయాన్ని నేలపట్టు పక్షుల కేంద్రంలోని వన్యప్రాణి విభాగం అధికారుల సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న ఎఫ్ఎస్ఓ బాలయ్య, సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని, ఆ బాతును పట్టుకుని పక్షుల కేంద్రంలో వదిలిపేట్టేందుకు ప్రయత్నం చేశారు. కాని అతి కష్టం మీద గూడబాతు ఎగిరివెళ్లింది. వయస్సు మీద పడిన గూడబాతులు అప్పుడప్పుడు ఎగురలేక ఉండిపోతాయని సంబంధిత అధికారులు తెలిపారు.

సంక్షేమ ప్రదాత జగనన్నకు తోడుగా ఉందాం

- నవరత్నాలతో ప్రతి ఇంటికి రూ.లక్షల్లో లబ్ధి
- గడప గడపలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి





పూల వర్షంతో ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న మహిళలు, పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: సంక్షేమ ప్రదాత జగనన్నకు తోడుగా ఉందామని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కోరారు. గురువారం మున్సిపాలిటీలోని 10వ వార్డు పరిధిలోని కైకాలవీధి, మంగళవీధి, కొత్తపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. ప్రతి ఇంటా అయన్ను సాదరంగా ఆహ్వానించి జగనన్న పాలనలో పథకాలు నేరుగా ఇంటికే చేరుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. అర్హత ఉండి సంక్షేమ ఫలాలు అందని వారిని గుర్తించి వెంటనే పథకాలు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. నేరుగా లబ్ధిదారుల ఖాతాలో లబ్ధి చేరే విధంగా ఎలాంటి అవినీతికి తావులేకుండా పారదర్శకతకు పెద్దపీట వేశారని తెలిపారు. ప్రజలకు నేరుగా డబ్బులు ఖాతాల్లో పడడం వల్ల పేదల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడ్డాయన్నారు. డ్రైనేజీ, రోడ్ల ప్యాచ్ వర్క్ పెండింగ్ తదితర సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, నాయకులు జనార్దన్‌రావు పవార్, హరినాథ్, సుందరరామిరెడ్డి, లీలావతి, ఆయూబ్ ఖాన్, సురేష్, కామయ్య, శ్రీహరి, మునిశేఖర్‌రెడ్డి, పరమేశ్వరయ్య,ప్రభాకర్‌నాయుడు, హరీష్, గోపాల్, గఫూర్, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యం ప్రజలకు అందుబాటులో

శ్రీకాళహస్తి పట్టణ ప్రజలకు తాను సేవకుడిగా నిత్యం అందుబాటులో ఉంటున్నానని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటా నవరత్నాలు పథకాల కింద సగటున రూ.5లక్షల వరకు నేరుగా అందిందని అక్క,చెల్లెమ్మలు సంతోషాన్ని పంచుకోవడం చూస్తుంటే సంతోషంగా ఉందన్నారు. శ్రీకాళహస్తిలో 30ఏళ్ల బొజ్జల కుటుంబ పాలనలో ప్రజలు సమస్యలు చెప్పుకోవాలంటే ఎక్కడికి వెళ్లాలో తెలియని పరిస్థితి ఉండేదని అన్నారు. వారు ఎన్నికల్లో గెలవగానే హైదరాబాద్‌కు వెళ్లి తమ వ్యాపారాలను చూసుకునేవారని విమర్శించారు. తొలిసారిగా తాను శ్రీకాళహస్తి పట్టణంలో పార్టీ కార్యాలయం ఏర్పాటు చేశానని, అక్కడ సిబ్బందిని పెట్టడమే కాకుండా తాను, తన కుమార్తె బియ్యపు పవిత్రా రెడ్డి అందుబాటులో ఉంటూ సమస్యలు తెలుసుకుని పరిష్కరించే పరిస్థితి గత నాలుగేళ్లుగా ఉందని గుర్తు చేశారు. గత పాలకులకు, తనకు ఉన్న తేడాను ప్రజలు గమనించాలని కోరారు. ఎన్నికలకు ఆరు నెలల ముందే గడప గడపకు వెళుతుంటే ప్రజలు తమను సొంతవారిలా అక్కున చేర్చుకుంటుండడం ఆనందంగా ఉందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుని సంక్షేమ పాలనకు మద్దతుగా నిలవాలని కోరారు.

రైతుల కల్పతరువు అరణియార్



అరణియార్ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

- ప్రాజెక్టు అభివృద్ధికి వైఎస్ కుటుంబం పెద్దపీట
- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం
- రైతుల నడుమ ప్రాజెక్టు గేట్లకు ఆయుధపూజ



ఆయుధ పూజలో ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు: సత్యవేడు నియోజకవర్గంలోని మూడు మండలాల రైతులకు అరణియార్ జలాశయం కల్పతరువుగా ఉంటోదని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. గురువారం మధ్యాహ్నం అరణియార్ వద్ద రూ.1.82 కోట్లు తుడా నిధులతో చేపడుతున్న పర్యాటక అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. అక్కడ నుంచి జలాశయం గేట్ల వద్దకు చేరుకుని నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో గేట్ల అయుధ పూజలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పిచ్చాటూరు, నాగలాపురం, కేవీబీపురం మండలాల రైతులు, ప్రజలకు ఈ జలాశయం కల్పతరువుగా ఉంటూ అదుకుంటుందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ హయాంలో (2004 నుంచి 2009 వరకు), ప్రస్తుత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఏటా వర్షాలు కురిసి ప్రాజెక్టు నిండు కుండలా నీటితో కళకళలాడుతుందన్నారు. వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో రూ.23 కోట్లతో ఈ ప్రాజెక్టు ఆధునికీకరణ పనులు చేపట్టగా, ముఖ్యమంత్రి జగనన్న రూ.35 కోట్ల జైకా నిధులతో ప్రాజెక్టును ఆధునికీకరిస్తున్నారని తెలిపారు. వీటితో పాటు తుడా నిధులు రూ.1.85 కోట్లతో పర్యాటక అభివృద్ధి పనులు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ఈ పనులన్నీ 2024 మార్చి చివరి కల్లా పూర్తి చేయాలని ఇరిగేషన్ ఈఈ మధనగోపాల్‌కు ఎమ్మెల్యే సూచించారు. ఈ ప్రాజెక్టు నిర్మించిన నాటి నుండి ఇంత పెద్ద మొత్తంలో అభివృద్ధి ఏ ముఖ్యమంత్రి చేపట్టలేదని ఆయన స్పష్టం చేశారు. ప్రాజెక్టును అభివృద్ధి చేసి రైతులను ఆదుకోవడం కాదా అభివృద్ధి అంటే.. అని ప్రతిపక్ష పార్టీలను ఎమ్మెల్యే ప్రశ్నించారు. అలాగే ఎత్తిపోతల పథకం ద్వారా ప్రాజెక్టు పైభాగంలో ఉన్న కీళపూడి భూములకు నీరందించనున్నట్లు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈఈలు ఆదినారాయణ నాయుడు, చంద్రసురేష్, గురివి రెడ్డి, ఏఈఈలు లోకేశ్వర్ రెడ్డి, మురళీ మోహన్, శివబాల, రేఖ, సురేష్, తహసీల్దారు మధుసూధన్, ఎంపీడీఓ శ్రీనివాసులు, పిచ్చాటూరు, నాగలాపురం, కేవీబీపురం మండలాల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు కె.వెంకటచలపతిరాజు, అపరంజిరాజు, గవర్ల కృష్ణయ్య, రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి గజేంద్ర, రైతు సలహా మండలి చైర్మన్ చిన్నదొరై, ఎంపీటీసీ సభ్యులు శోభన్, బేబి, సర్పంచ్ అణ్ణాదురై, కిరణ్‌కుమార్, వైఎస్సార్ సీపీ నేతలు ఆర్‌డీ ఏకాంబరం (నారాయణ వనం), పాలపద్మనాభం, నందకుమార్, శ్యామ్, తొప్పయ్య, మోహన్, సుబ్రమణ్యం, ఆర్ముగం రెడ్డి, అయ్యప్ప, రైతులు పాల్గొన్నారు.

హాస్టల్ నిర్వహణపై అసహనం

మధ్యాహ్నం 2 గంటలకు పిచ్చాటూరు జెడ్పీ హైస్కూల్ వద్ద ఉన్న బీసీ బాలికల సంక్షేమ హాస్టల్‌ను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ గదులు పైకప్పు పెచ్చులూడి దర్శనం ఇస్తుండడం, స్నానపు గదులకు సరైన తలుపులు లేకపోవడం, హాస్టల్ ఆవరణ పిచ్చిమొక్కలతో పారిశుద్ధ్యం లోపించి ఉండడం చూసి ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న హాస్టల్ వార్డెన్ గీతపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే బీసీ సంక్షేమ శాఖ డీడీ భాస్కర్‌రెడ్డికి ఎమ్మెల్యే ఫోన్ చేసి తాజా పరిస్థితిని వివరించారు. హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని, పేద విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని ఎమ్మెల్యే కోరారు.

స్కాలర్‌షిప్‌ల మంజూరు భేష్



విద్యార్థులను ప్రశ్నిస్తున్న అధికారుల బృందం

పుత్తూరు రూరల్: ఉపకార వేతనాలు షెడ్యూలు కులాల విద్యార్థులకు అందుతున్న తీరు, నిధుల నిర్వహణ చాలా బాగుందని కేంద్ర, రాష్ట్ర అధికారుల బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. పుత్తూరు పట్టణంలోని ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం షెడ్యూలు కులాల విద్యార్థులకు అందుతున్న ఉపకార వేతనాల వినియోగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో కేంద్ర సామాజిక న్యాయం, సాధికార మంత్రిత్వ శాఖకు చెందిన ప్రియాంకతోమర్, సౌరభ్‌రంజన్, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ సహాయ అధికారి శ్రీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రియాంకతోమర్ మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఎస్సీ విద్యార్థికి స్కాలర్‌షిప్ అందించేందుకు ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రిన్సిపల్ జి.శ్రీనివాసులురెడ్డి, సుజన, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహుడి సేవలో అంజూరు శ్రీనివాసులు



అంజూరుకు శ్రీవారి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

రాపూరు: పెంచలకోనలోని పెనుశిల శ్రీలక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయస్వామివారిని శనివారం శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. వీరికి దేవస్థానం సిబ్బంది స్వాగతం పలికి మూడు ఆలయాల్లో దర్శన ఏర్పాట్లు చేసి, తీర్థ ప్రసాదాలు, వేదపండితుల ఆశీర్వచనాలు, శ్రీవారి చిత్రపటాన్ని అందజేశారు.

కండలేరులో 11.353 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 11.353 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 40 క్యూసెక్కులు, పిన్నెరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్ కు 5, లోలెవల్ స్లూయిస్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్య సేవలు



ఏర్పేడు : కిట్లు పంపిణీ

ఏర్పేడు: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని ఎంపీపీ గీత, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌కుమార్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఎండీపుత్తూరులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. శిబిరంలో 468 మంది రోగులను పరీక్షించి మందుల కిట్లు అందజేశారు. బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు తిరుమలయ్య, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శివయ్య, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య సర్పంచ్‌లు మోహన ప్రియ, చెంగల్‌రాజు, ఎంపీటీసీ సభ్యురాలు పద్మమ్మ పాల్గొన్నారు.

పకడ్బందీగా నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే



మాట్లాడుతున్న దయాకర్

ఏర్పేడు: మండలంలో ఎంపిక చేసిన పాఠశాలల్లో శుక్రవారం నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (నాస్) పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈఓ–2 దయాకర్ అన్నారు. గురువారం మండలంలోని మేర్లపాక, మన్నసముద్రం ప్రాథమికోన్నత పాఠశాలల్లో 3,6 తరగతుల విద్యార్థులకు స్మార్ట్ టీవీ ద్వారా అనుమానాలు నివృత్తి చేసి నమూనా పరీక్ష పత్రాలను విశ్లేషిస్తూ అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పరీక్షలకు ఎంపికైన పాఠశాలల్లో గాలి, వెలుతురు సక్రమంగా ఉన్న గదులకు విద్యార్థులకు కేటాయించాలని సూచించారు. 6,9 తరగతుల విద్యార్థులకు ఇచ్చిన ఓఎంఆర్ పత్రాల్లో సమాధానాలను గుర్తించాలని పేర్కొన్నారు. 3వ తరగతి విద్యార్థులు మాత్రం ఇచ్చిన ప్రశ్న పత్రాల్లో సమాధానం గుర్తించి సున్నా చుట్టాలని చెప్పారు. పరీక్షకు ఫీల్డ్ ఇన్విజిలేటర్లుగా హెచ్ఎంలు బాధ్యత వహించాలన్నారు.

పది లారీల పట్టివేత

చిల్లకూరు: అనుమతులు లేకుండా తెల్లరాయి తరలిస్తున్న పది లారీలను పట్టుకుని చిల్లకూరు పోలీసులకు గురువారం మైనింగ్ అధికారులుఅప్పగించారు. ఇటీవల ప్రభుత్వ భూముల్లో అనుమతులు లేకుండా తెల్లరాయిని తవ్వి, తరలిస్తున్నారన్న సమాచారం అందింది. దీనిపై స్పందించిన జాతీయ రహదారిపై నిఘా పెట్టి, మైనింగ్ అధికారులు పది లారీలను సీజ్ చేసినట్లు తెలిపారు.

ఆగమశాస్త్రంపై పరిశోధనలు

తిరుపతి సిటీ: వైఖాన, శైవ ఆగమశాస్త్రాలపై విస్తృత పరిశోధనలు జరగాలని కొవ్వూరు విద్యాపీఠం రిటైర్డ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనివాసదీక్షితలు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక జాతీయ సంస్కృత విద్యాపీఠంలో జరిగిన అగమశాస్త్రాల పరిశోధనలపై జరిగిన రెండు రోజుల జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వర్సిటీలో ఆగమ శాస్త్రంపై పరిశోధనలు విస్తృతంగా జరగాలని అందుకోసం ఆగమ పీఠం నెలకొల్పేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. వీసీ కృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, డీన్ రాఘవాచార్యులు పాల్గొన్నారు.

భౌతిక శాస్త్రంతో సంపూర్ణ విజ్ఞానం

తిరుపతి సిటీ: భౌతిక శాస్త్రం ద్వారా విద్యార్థులకు సంపూర్ణ విజ్ఞానంతో కూడిన విద్య అందుతుందని టీటీడీ విద్యాశాఖాధికారి భాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం పద్మావతి మహిళా డిగ్రీ కళాశాల, పీజీ కళాశాలలో మూడు రోజుల ప్రాంతీయ శిక్షణ ప్రారంభించారు. తిరుపతి పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ, టీటీడీ జూనియర్ కళాశాలల నుంచి 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రయోగాల ద్వారా భౌతిక శాస్త్ర అవశ్యకత, ప్రాముఖ్యతను తెలుసుకోవచ్చన్నారు. ప్రిన్సిపల్ మహదేవమ్మ, ప్రొఫెసర్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నామినికి సన్మానం



జీవితానుభవాలను కథలుగా రచించి పాఠకుల మన్ననలు పొందిన సుప్రసిద్ధ రచయిత నామిని సుబ్రమణ్యం నాయుడు వైఎస్ఆర్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు అందుకుని శ్రీకాళహస్తికి విచ్చేసిన సందర్భంలో సబ్ రిజిస్ట్రార్ కొండారెడ్డి, సిబ్బంది ఆయనకు శాలువా కప్పి శ్రీవారి విగ్రహాన్ని బహూకరించి గౌరవించారు.

–శ్రీకాళహస్తి

వంద శాతం పింఛన్ల పంపిణీ





బీఎన్‌కండ్రిగ: పింఛన్ అందజేస్తున్న వలంటీర్, ఏర్పేడు: తిరుపతిలో లబ్ధిదారుడికి పింఛన్ అందజేత

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో సామాజిక పింఛన్లను రెండు రోజుల్లోనే వందశాతం పంపిణీ చేశారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువుల ఇంటింటికీ వెళ్లి వలంటీర్లు వంద శాతం పింఛన్ నగదు అందజేసినట్లు ఎంపీడీఓ నరసింహారావు తెలిపారు. గ్రామ కార్యదర్శుల ఆధ్వర్యంలో వలంటీర్లలందరూ గురువారం సాయంత్రానికి పింఛన్ల పంపిణీ పూర్తి చేశారన్నారు.ఇంటికే వచ్చి పింఛన్ ఇవ్వడంపై లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.

తిరుపతికి వెళ్లి..

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురం గ్రామానికి చెందిన కొంగర రత్నమ్మ(49)కు తిరుపతికి వెళ్లి వలంటీర్ పింఛన్ అందజేశారు. అనారోగ్యంతో ఆమె వారం రోజులుగా తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ మునెమ్మ అక్కడికి వెళ్లి వేలిముద్రలు తీసుకుని నగదును అందించారు. వలంటీర్ల సేవలను అధికారులు అభినందించారు.

ముమ్మరంగా శ్రీవరి సాగు



పల్లమాలలో యంత్రంతో శ్రీవరి సాగు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాంపాళెం, పల్లమాల, కాటూరు, కనమనంబేడు గ్రామాల్లో రైతులు యంత్రంతో శ్రీవరి సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. కాంపాళ్లెం గ్రామంలోని 20 ఎకరాల్లో శ్రీ వరిపంట సాగు చేస్తున్నారు. శ్రీవరి సాగులో అధిక దిగుబడిని సాధించవచ్చని రైతులు తెలిపారు. కూలీల బెడద ఉండక పోవడంతో, తక్కువ నీటి వాడకం, తక్కువ మోతాదులో ఎరువుల వినియోగం, విద్యుత్ ఆదా తదితరాలతో యంత్రంతో శ్రీవరి సాగుపై రైతులు మక్కువ చూపుతున్నారు. కూలీలు నాటిన పంట కంటే ఎకరాకు ఐదు బస్తాలు ధాన్యం యంత్ర సాగులో ఎక్కువగా వస్తుంది. పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది. ఇప్పటికే పల్లమాల, కారణి గ్రామాల్లో శ్రీవరిని రైతులు సాగుచేస్తున్నారు. శ్రీవరిలో కలుపు ఉండదని, తెగుళ్ల ఎక్కువగా రావని, ధాన్యం నాణ్యతగా ఉంటుందని రైతులు అంటున్నారు.